విద్యార్థులను బడికి పంపాలి

- తల్లిదండ్రులకు కమిషనర్ సూచన

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులను రోజూ బడికి పంపాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ తల్లిదండ్రులకు సూచించారు. గురువారం 16వ డివిజన్‌లోని సోమయాజుల నగర్‌లో విద్యార్థులు బడికి వెళ్లకుండా ఇంటివద్దనే ఉన్నారు. దీంతో కమిషనర్ విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. బడికి హాజరు లేకపోతే విద్యార్థులు అన్ని విధాల నష్టపోతారని పేర్కొన్నారు. వృ పనుల్లో భాగంగా స్థానికులతో మాట్లాడుతూ చెత్తను సేకరించే వారు రోజూ వస్తున్నారో లేదో అడిగి తెలుసుకున్నారని తెలిపారు. పలువురు పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతూ ఉదయం నుంచి వారు చేసే పనుల గురించి అడిగి తెలుసుకుని పలు సూచనలు ఇచ్చారు.

విశాఖ జి-20 సదస్సుకు

మైదుకూరు వెదురు ఉత్పత్తులు

ఆధునిక ఉత్పత్తులపై నైపుణ్య శిక్షణ

ప్రజాశక్తి-చాపాడు

ఆధునిక వెదురు ఉత్పత్తుల తయారీకి మైదుకూరులోని మార్కెట్ యార్డ్ ఆవరణం వేదికగా మారింది. వెదురు ఉత్పత్తి దారులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వెదురు వృత్తిదారుల సంక్షేమ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మేదర వృత్తి కలవారికి అవగాహన కల్పించి వివిధ రకాల వెదురు ఉత్పత్తులను సిద్ధం చేయిస్తున్నారు. వెదురు ఉత్పత్తులను త్వరలో గ్రీన్ సిటీ విశాఖలో జరగబోయే పర్యావరణ జి-20 సదస్సులో ఫ్లవర్ వాజ్‌లు, రోడ్ల వెంబడి అలంకరణకు ఈ వెదురు ఉత్పత్తులను వినియోగించనున్నట్లు తెలుస్తున్నది. రాయచోటి, మదనపల్లె, మైదుకూరు ప్రాంతానికి చెందిన వెదురు ఉత్పత్తిదారులను గుర్తించి వారికి శిక్షణ ఇచ్చి వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేయిస్తున్నారు. ఫ్లవర్ వాజ్‌లు, రోడ్డు వెంబడి అలంకరణకు ఉపయోగపడే డ్రమ్ములు, గంపలు సిద్ధం చేయించి వాటికి రంగులు వేయిస్తున్నారు. వెదురు ఉత్పత్తులు తయారు చేసిన కళాకారులకు రోజువారి వేతనంతో పాటు సర్టిఫికెట్ అందజేస్తున్నారు. బాంబో మిషన్ వెదురు ఉత్పత్తుల అభివృద్ధి సంస్థ మేదర వృత్తిపై ఆధారపడే వారిని గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వెదురు ఉత్పత్తులను ఉపయోగించడం వలన ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలను తగ్గించుకోవచ్చు. దీని ద్వారా వెదురు ఉత్పత్తిదారులకు ఆదరణ లభిస్తున్నది. పర్యావరణ జి-20 సదస్సుకు మైదుకూరు నుంచి వెయ్యి వెదురు ఉత్పత్తులను సిద్ధం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

శిక్షణ ఉపయోగకరంగా ఉంది

గత ఎన్నో ఏళ్లుగా వెదురు ఉత్పత్తులను తయారు చేస్తున్నాం. మార్కెటింగ్‌పై అవగాహన లేకపోవడంతో తక్కువ ధరలకే ఉత్పత్తులను అమ్ముకునే వాళ్ళం. ఆధునిక వెదురు ఉత్పత్తులపై నైపుణ్య శిక్షణ ఇస్తుండటం వలన ఉపయోగకరంగా ఉంది. రోజుకు రూ.1500 వరకు ఉపాధి అందు తుంది. శిక్షణలో వివిధ రకాల భిన్న ఉత్పత్తులు సిద్ధం చేసే అవగాహన కల్పించారు.

- రామయ్య, వెదురు కార్మికుడు.

ఆధునిక ఉత్పత్తులపై శిక్షణ

ఆధునిక వెదురు ఉత్పత్తులపై శిక్షణ ఇస్తూ నైపుణ్యతను పెంచే ప్రయత్నం చేస్తున్నాం. గతంలో వెదురుతో వివిధ రకాల వ్యవసాయ ఉపయోగ పదార్థాలను తయారు చేసేవారు. వారికి కొంత శిక్షణ ఇచ్చి అలంకరణ పదార్థాలు చేయిస్తున్నాం. జి-20 సదస్సుకు వెదురు ఉత్పత్తులను సిద్ధం చేయిస్తున్నాం. శిక్షణతో పాటు ఉపాధి, మార్కెటింగ్ అవకాశాన్ని కల్పిస్తున్నాం.

- రాఘవేంద్ర, ఎన్‌జిఒ ప్రెసిడెంట్.

అమరుల స్ఫూర్తితో పోరాటాలు సాగిద్దాం

భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకుల పిలుపు

జమ్మలమడుగులో భగత్‌సింగ్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన విప్లవ యువ కిషోరాలు షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ దేవ్‌ల అమరుల స్ఫూర్తితో హక్కుల కోసం పోరాటాలకు యువత నడుం బిగించాలని ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు సురేష్ నాయక్, పవన్ కళ్యాణ్, డివైఎఫ్ఐ నగర అధ్యక్షుడు షాకీర్ తెలిపారు. గురువారం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ దేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకుని విద్యార్థి, యువజన సంఘాల అధ్వర్యంలో పాత బస్టాండ్ కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం చిన్న వయస్సులోనే దేశం కోసం భగత్‌సింగ్ ప్రాణాలర్పించారని చెప్పారు. త్యాగానికి, స్నేహానికి మారుపేరుగా ముగ్గురు నిలిచారని తెలిపారు. నేడు కేంద్ర ప్రభుత్వం వీరి త్యాగానికి తగిన గుర్తింపును ఇవ్వడం లేదన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో భగత్‌సింగ్ జీవిత చరిత్రను సైతం తొలగించిందని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చాక కార్పొరేట్ గద్దలైన అదాని, అంబాని వారికి దేశ సంపదను బిజెపి దోచిపెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను బిజెపి అమ్మేస్తోందని వాపోయారు. దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగం పెరిగి పోతుందని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడప ఉక్కుకు నిధులు, రాయ లసీమకు భుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని బిజెపి ఇచ్చిన హామీలు ఇప్పుడు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. పార్లమెంటు సమావేశాలలోనూ హోదా ముగిసిన అధ్యాయనం అని చెబుతుంటే మన రాష్ట్ర అధికార, ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ఏం చేస్తున్నారని పేర్కొన్నారు. హక్కుల కోసం గళం విప్పాల్సిన అవసరం వచ్చిందన్నారు. సొంత ప్రయోజనాల కోసం బిజెపి వద్ద మోకరిల్లుతే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. యువత సైతం అమరుల త్యాగాల స్ఫూర్తితో హక్కుల కోసం పోరాటాలలో కలిసి రావాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వం జిల్లాలో భగత్ సింగ్ విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరారు. అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్,విజయ్ పాల్గొన్నారు. **పోరుమామిళ్ల టౌన్:** భగతసింగ్ పోరాటం నేటి విద్యార్థులు, యువత కు స్ఫూర్తిదాయకం అని ఎస్ఎఫ్ఐ సహాయ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి అన్నారు. భగత్ సింగ్ 92వ వర్ధంతి పోరుమామిళ్ల స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాల యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు ప్రశాంత్, కిరణ్, సుధాకర్, చంటి, బబ్లు,విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** నేటి యువతకు స్ఫూర్తి భగత్‌సింగ్ అని జెవివి రాష్ట్ర కార్యదర్శి సురేష్‌రెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజ్, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి సురేష్ పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక గీతాంజలి పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవకారుడు భగత్‌సింగ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శివనాగిరెడ్డి, సురేష్‌సింగ్ చెన్నయ్య, శివ, మల్లి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన విప్లవ యువ కిషోరాలు షహీద్ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ అమరుల స్ఫూర్తితో హక్కుల కోసం పోరాటాలకు యువత నడుం బిగించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ పిలుపునిచ్చారు. గురువారం భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతిని పురస్కరించుకొని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జమ్మలమడుగు పాత బస్టాండ్ వద్ద భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పించారు. జమ్మలమడుగుతోపాటు జిల్లాలో కూడా భగత్‌సింగ్ విగ్రహాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. అలాంటి వారి విగ్రహాలు ఏర్పాటు చేస్తే యువతకు స్ఫూర్తి కలుగజేస్తాయన్నారు. కార్యక్రమంలో నాయకులు కమాల్‌బాషా, రఘు, మోషే, చిన్నా పాల్గొన్నారు.మ **వేంపల్లె :** దేశం కోసం ప్రాణాలర్పించిన అసలైన దేశభక్తులు సర్దార్ భగత్ సింగ్, షాహిద్ రాజగురు, షాహిద్ సుఖదేవ్ అని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. వారి 92వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం కాంగ్రెస్ నాయకులు వారికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, చెన్నకేశవ, రామకృష్ణ, సుబ్బరాయుడు, నాగార్జున పాల్గొన్నారు.

కడపలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

నీటిని పొదుపుగా వాడాలి

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, జెవివి నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

నీటిని పొదుపుగా వాడుకోవాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ అన్నారు. గురువారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా రవీంద్రనగర్, అక్కాయపల్లెలలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ నీటి దినోత్సవాన్ని ప్రపంచ్యాప్తంగా పాటించాలన్న ఆలోచన, 'పర్యావరణం, ప్రగతి అనే అంశంపై 1992లో రియో డి జెనేరో లో జరిగిన ఐక్యరాజ్యసమితి మహాసభ" లో రూపుదిద్దుకుందని తెలిపారు. ఇందులో భాగంగా 2010 సంవత్సరాన్ని 'ఆరోగ్యవంతమైన ప్రపంచంకోసం, పరిశుభ్రమైన నీరు' అనే, నిర్దిష్ట భావనతో పాటిస్తున్నారని చెప్పారు. మనం నివసించే భూగోళంలో 70 శాతానికిపైగా నీరే, అయితే ఇందులో శుభ్రమైన నీరు చాలా స్వల్ప భాగం మాత్రమే అన్నారు. మొత్తం భూగోళంలోని నీటిలో దాదాపు 2.7 శాతం మాత్రమే శుభ్రమైన నీరు కాగా, ఇందులోనూ 75.2 శాతం ధృవ ప్రాంతాలలో మంచురూపంలో ఘనీభవించి ఉంటే, మరో 22.6 శాతం నీరు భూగర్భంలో ఉందని పేర్కొన్నారు. మిగతా నీరు సరస్సులు, నదులు, వాతావరణం, గాలిలోని తేమ, భూమిలోని చెమ్మ, చెట్టు చేమలలో ఉంటుందని తెలిపారు. సరస్సులు, నదులు, భూగర్భ జలాలలో కూడా మానవ వినియోగానికి, ఇతర అవసరాలకు చక్కగా ఉపయోగపడగలిగిన నీరు, చాలా కొద్ది పరిమాణం మాత్రమే అన్నారు. ప్రపంచం మొత్తంలో లభ్యమయ్యే, పరిశుభ్రమైన నీటిలో 1 శాతం కంటే కూడా తక్కువ పరిమాణంలో నీరు మానవ వినియోగానికి నేరుగా ఉపయోగపడుతుందని తెలిపారు.రోజూ మనకు కనీసం 30-50 లీటర్ల పరిశుభ్రమైన, సురక్షితమైన నీరు అవసరమని పేర్కొన్నారు. ఇప్పటికీ 88.4 కోట్ల మంది (884 మిలియన్ల మంది) ప్రజలకు సురక్షితమైన నీరు అందుబాటులో లేదని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిటీ నాయకులు మధుసూదన్, సత్యనారాయణ, శ్రీనివాసరాజు, అబ్దుల్ కరిముల్లా, సువర్ణలత పాల్గొన్నారు.

సెల్ ఫోన్లు రికవరీ.. బాధితులకు అప్పగింత

కడప అర్బన్ : జిల్లాలో సెల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు పోలీస్ శాఖ రికవరీ చేసి అందజేసిందని ఎస్పి తెలిపారు. గురువారం పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో బాధితులను పిలిపించి ఎస్పి స్వయంగా సెల్‌ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాట్ బాట్ సేవలు ప్రారంభించిన అనతికాలంలోనే రూ.1.30 కోట్లు విలువ చేసే 476 సెల్ ఫోన్లు రికవరీ చేశామని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా, ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు అందజేశామని తెలిపారు. ఎంఎంటిఎస్ ఉచిత వెబ్‌సైట్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు మరింత సులువైన సేవలు అందించడానికి చాట్ బాట్ ద్వారా వాట్సాప్ నంబర్ 9392941541 సేవలు ప్రారంభించామని పేర్కొన్నారు. ఇప్పటివరకు 3,600 మొబైల్స్ పోయినట్లు ఫిర్యాదు రాగా అందులో ఎంఎంటిఎస్ ద్వారా 700 యాక్టివ్ మొబైల్స్ గుర్తించగా ఇందులో 476 మొబైల్స్‌ను రికవరీ చేశామని చెప్పారు. ఇప్పటివరకు 261 మొబైల్స్ అందజేశామని తెలిపారు. సెల్ ఫోన్లు రికవరీలో శ్రమించిన సిఐ శ్రీధర్ నాయుడు, ఎస్ఐమధు మల్లేశ్వర రెడ్డి, పి రవికుమార్, శ్రీనివాసులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో అదనపు ఎస్పి తుషార డూడి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చెన్నూరు : కమలాపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆధ్వర్యంలో కడప-కర్నూల్ జాతీయ రహదారి ఎల్లమ్మ కాంప్లెక్స్ వద్ద గల వ్యవసాయ మార్కెట్ యార్డ్ తనిఖీ కేంద్రం వద్ద కమలాపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పుల్లారెడ్డి, సెక్రటరీ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, వైసిపి మండల కన్వీనర్ జీయన్ భాస్కర్ రెడ్డి, ముఖ్య అతిథులుగా పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలంలో వాహనదారులకు, బాటసారులకు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు కమలాపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌బ్ చైర్మన్ పుల్లారెడ్డి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్మెంబర్ గోర్ల పుల్లయ్య గారి చంద్ర ఓబులరెడ్డి, వైసిపి నాయకులు టి.ఎన్ చంద్ర రెడ్డి, భాస్కర్, చంద్ర పాల్గొన్నారు.**కాశినాయన :** వెలుగు మండల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో చలి వేంద్రం ఏర్పాటు చేశారు తహశీల్దార్ రామచంద్రుడు, ఎంపిడిఒ ముజఫర రహీం ఆ శాఖ ఎపిఎం వీరాంజనేలు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలం వచ్చిందని, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారికి చల్లని చలివేంద్రం ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో వెలుగు పథకం సిబ్బంది, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరు : చలివేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రాజకీయ లబ్ధి కోసమే ముస్లిముల విభజన

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న సలావుద్దీన్

కొందరు రాజకీయ లబ్ధి కోసం ముస్లిం మైనార్టీలను విభజించి పాలిస్తు న్నారని సంఘ సేవ కులు సయ్యద్ సలా వుద్దీన్, ఆంధ్రప్రదేశ్ సున్ని మషిఖా వెల్ఫేర్ అసోసియేషన్ నాయ కులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నగరం లోని బుఖారీయ మస్జిద్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ లబ్ధికోసం విభజించి పరిపాలించే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వెనుకబడిన పేద ముస్లిం మైనార్టీలకు ఆర్థికంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం రాజకీయ లబ్ధికోసం అన్నదమ్ములుగా కలిసి ఉన్న ముస్లిం మైనార్టీలను సయ్యద్, పఠాన్, షేక్, మొఘల్ అనే కులాల వారీగా కార్పొరేషన్ల పేర్లతో విభజించడం సరికాదని హెచ్చరించారు. తమిళనాడు రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు 10 శాతం రిజ్వేషన్ ఏర్పాటు చేశారని, ఇదే తరహాలో సిఎం జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటు చేయాలన్నారు. మైనార్టీలను కులాల వారిగా విడగొట్టడం మానుకుని, ముస్లిం మైనార్టీలందరికీ 10 శాతం రిజ్వేషన్ కోసం కృషి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు జకాఉద్దీన్ సాహెబ్, సిరాజుద్దీన్ బుఖారి, నిజాముద్దీన్ బుఖారి, ప్రముఖ సంఘా సేవకుడు సయ్యద్ సలావుద్దీన్, ఖలీల్ సయ్యద్, జిలానీ బాషా, మగ్దుమ్ బుఖారి, జాకిర్ మౌలానా, మగ్బుల్ పాల్గొన్నారు.

ప్రిన్స్ వంజకు కె.విశ్వనాథ్ 'సంకల్ప పురస్కారం'

ప్రజాశక్తి - కడప

పురస్కారం అందుకుంటున్న ప్రిన్స్ వంజ

పద్మశ్రీ కే విశ్వనాథ్ 'సంకల్ప పుర స్కారాన్ని' కడపకు చెందిన ఎవిఎం చారిటీస్ సంస్థ అధినేత ప్రిన్స్ వంజ అందుకున్నారు. సినీ రచయితలు, నటులు, గాయకులు, నాట్య, నాటక కళాకారులు, వివిధ రంగాలలో తమ సేవలు అందించిన వ్యక్తులకు ఉగాది సందర్భంగా పద్మశ్రీ దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత డాక్టర్ కె. విశ్వనాథ్ పేరున ఉగాది, సంకల్ప పురస్కారాల ప్రధానోత్సవం అట్టహాసంగా రాష్ట్ర రాజధాని విజయవాడలో నిర్వహించారు. విజయశ్రీ సాంస్కృతిక సేవ సంస్థ ఆధ్వర్యంలో తమిళనాడు, కర్ణాటక, తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలోని 30 మంది విభిన్న రంగాల ప్రముఖులకు ఈ పురస్కారాలు ఉగాది పర్వదినాన అందజేశారు. కడప వాసి అయిన ప్రిన్స్ వంజ తన సంస్థ ఏవీఎం చారిటీస్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను, గానం, సంగీతం మరియు సాంకేతిక విభాగాలలో తన కృషిని ప్రతిభను గుర్తించి. కే. విశ్వనాథ్ సంకల్ప పురస్కారాలతో సత్కరించారు.

జర్నలిస్టు శ్రీనాథ్‌రెడ్డి మృతికి ఘన నివాళి

కడప అర్బన్ : విలువలకు పెద్దపీట వేస్తూ పాత్రికేయానికి సరైన అర్థంలా నిలిచిన సీనియర్ పాత్రికేయులు దేవి రెడ్డి శ్రీనాథ్ రెడ్డి మృతి ఆవేదనకు గురిచేసిందని యోగివేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య జింక రంగ జనార్ధన్, రిజిస్ట్రార్ ఆచార్య వై. పి. వెంకటసుబ్బయ్య, తెలుగు శాఖ ఆచార్యులు, గజ్జల మల్లారెడ్డి ట్రస్ట్ కన్వీనర్ ఎన్. ఈశ్వరరెడ్డి తెలిపారు. జిల్లాలో పాత్రికేయుడిగా జీవితాన్ని ప్రారంభించి జాతీయ ఆంగ్ల, తెలుగు పత్రికలలో పనిచేసిఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ ఎదిగిన శ్రీనాథ్ రెడ్డి ఆదర్శ భావాలుగల వారని తెలిపారు. అందువల్లే యోగి వేమన విశ్వవిద్యాలయం ద్వారా ప్రముఖ పాత్రికేయులు గజ్జల మల్లారెడ్డి పురస్కారం -2019 ను ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, పూర్వపు విసి ఆచార్య మునగల సూర్య కళావతి, పూర్వపు రిజిస్ట్రార్ ఆచార్య విజయ రాఘవ ప్రసాద్ చేతుల మీదుగా అందజేశామన్నారు.

మహిళా కేంద్ర కారాగారాన్ని సందర్శించిన జడ్జి

కడప : మహిళా ఖైదీలకు ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ(డిఎల్ఎస్ఎ) కడప దృష్టికి తీసుకువస్తే తగు న్యాయం చేస్తామని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత అన్నారు. గురువారం జడ్జి మహిళ కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. అక్కడ ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఖైదీల కుటుంబ సభ్యులు పొందేందుకు న్యాయ సలహాలు, న్యాయ సాయం అందజేస్తామన్నారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చు అన్నారు. కార్యక్రమంలో జైలు అధికారులు, డాక్టర్, మహిళ ఖైదీలు పాల్గొన్నారు.

సహాయక చర్యల స్ఫూర్తితో ముందుకెళ్లాలి

చింతకొమ్మదిన్నె: విపత్కర పరిస్థితుల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్ టీమ్ సహాయక చర్యల స్ఫూర్తితో సమాజంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా కాపాడే సామాజిక బాధ్యత అందరిపై ఉందని తహశీల్దార్ గంగయ్య పేర్కొన్నారు. కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశాల మేరకు ఎస్‌డిఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ శివకుమార్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మామిళ్లపల్లె ఎన్‌సిసి శిక్షణ ప్రాంగణంలో ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే ప్రాణాలను కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపె కెపాసిటి బిల్డింగ్ ప్రోగ్రామ్ ద్వారా సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహశీల్దార్ , కార్పొరేటర్ చంద్రహాసరెడ్డి, ఫైర్ శాఖ ఎస్ఐ జలీల్, ఎన్‌సిసి సూపరింటెంటెండెంట్ సుబేదా హనుమాన్ సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలను ప్రాణాపాయం నుండి కాపాడేందుకు సాహసోపేతమైన సహాయక చర్యలతో ఎస్‌డిఆర్‌ఎఫ్ టీమ్ సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీమని చెప్పారు. అనంతరం ఎన్‌డిఆర్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ శివకుమార్ మాట్లాడుతూ జిల్లాలో విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలను, మాక్ ఎక్స్ పర్ మెంట్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతోనే కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో ట్రైనింగ్ టీమ్ లీడర్ మహమ్మద్ అలీ, ఎన్‌సిసి కేడెట్లు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బండలాడుగు పోటీలు

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని లింగారెడ్డిపల్లెలో బాలింతమ్మ తిరుణాల సందర్భంగా గురువారం బండలాడుగు పోటీలు ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ నాగమురళి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోటీల్లో ప్రకాశం జిల్లా కు చెందిన ఎడ్లు రూ.50 వేల బహుమతిని కైవసం చేసుకున్నాయి. ద్వితీయ, తృతీయ, నాల్గో బహుమతులను వరుసుగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు ఆయా ఎడ్లు గెలుచుకున్నాయి. తిరుణాలకు వచ్చిన ప్ర.జలకు చెన్నయ్యగారి ఓబుల్‌రెడ్డి, రవణమ్మ దంపతులు అన్నదానం చేశారు. అనంతరం గ్రామ కమిటీ పెద్ద బోవిల్ల ఓబుల్‌రెడ్డి గురువు ఎస్. పుల్లయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భజన గురువులు గాన కోకిల, నాయనపల్లి ఓబులేసు, గురువు నారాయణరెడ్డి, బాలగురయ్య, సెయింట్ ఆంటోనీ పాఠశాల డ్రిల్ మాస్టర్ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

బండలాడుగు పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

26న వైవీయూలో క్రీడా పోటీలు

కడప అర్బన్ : 2022-23వ సంవత్సరానికి యోగి వేమన విశ్వవిద్యాలయ అంతర కళాశాలల సాఫ్ట్ బాల్, లాన్ టెన్నిస్ (సింగిల్స్, డబుల్స్) స్త్రీ, పురుష జట్ల కు పోటీలు ఈనెల 26న విశ్వవిద్యాలయంలోని వేమన క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు వైవీయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే జట్లు యోగి వేమన విశ్వవిద్యాలయంలో చదువుతూ ఉండాలని పేర్కొన్నారు. వయసు 2022, జూలై 1 వ తేదీ నాటికి 17 సంవత్సరాలు నిండి, 27 ఏళ్ల లోపు ఉండాలని తెలిపారు. ఆసక్తి కలవారు అర్హత పత్రం, పదవ తరగతి ఫొటోలతో కూడిన సర్టిఫికెట్లు, డిగ్రీ మార్కుల జాబితా అటెస్ట్ చేయించి తీసుకురావాలని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు అర్హత పత్రాల పరిశీలన ప్రారంభమవుతుందని తెలిపారు. 9 గంటలకు టోర్నమెంట్ మొదలవుతుందని పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో విన్నర్స్, రన్నర్స్ జట్లకు రూ.5000, రూ. 3000 ప్రైజ్ మనీ ఉంటుందని తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

కడప : విద్యుత్ సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపడతామని విద్యుత్ ఎస్ఇ ఎస్. మునిశంకరయ్య అన్నారు. గురువారం స్థానిక విద్యుత్ భవన్ నుంచి 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఇ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మునిశంకరయ్య మాట్లాడుతూ కార్యక్రమంలో కమలాపురం నుంచి అగ్రికల్చర్ కు సంబంధించిన విద్యుత్ సమస్యను పరిష్కరించాలని తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ సమస్యను తక్షణం పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డిప్యూటీ ఇంజనీర్ పి. సుబ్రహ్మణ్యం, జేఈ కమర్షియల్ జి. లావణ్య పాల్గొన్నారు.

కక్ష పూరిత రాజకీయాలు మానుకోవాలి

కడప : ఎన్నికల సందర్భంలో రాహుల్ గాంధీ చేసిన ప్రసంగాలపై కక్షపూరితంగా వ్యవహరించి, పరువు నష్టం దావాలు వేయడం సరైన చర్య కాదని, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూరత్ కోర్టు రాహుల్ గాంధీకి రెండు సంవత్సరాలు శిక్ష విధిస్తూ నేడు తీర్పు ఇవ్వడంతో, బిజెపి చర్యలు సరైనవి కావన్నారు. రాజకీయంగా రాహుల్ గాంధీకి వస్తున్న పేరును చూసి ఓర్వలేకనే ఇలాంటి చర్యలకు బిజెపి తెగబడుతుందన్నారు. భారత్ జూడో యాత్రతో రాహుల్ గాంధీకి కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు ప్రజాదరణ విపరీతంగా పెరిగిందన్నారు.2 024 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తప్పుడు కేసులతో రాహుల్ గాంధీని అపఖ్యాతి పాలు చేయాలనుకోవడం బిజెపి దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. కేసులకు కాంగ్రెస్ పార్టీ భయపడదన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో ప్రవేశపెడుతున్న పథకాలను చూసి, కేంద్రంలోని బిజెపి భయపడుతోందని అన్నారు.

ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలి

కడప : నంద్యాల జిల్లా, బనగానపల్లె తాలూకా, నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి జ్యోతుల మహోత్సవానికి కడప నుంచి యాత్రికులు హాజరయ్యేందుకుగానూ ఈనెల 25, 26 తేదీల్లో ప్రత్యేక ఆర్‌టిసి బస్సులను ఏర్పాటు చేయాలని తొగట వీరక్షత్రియ సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. గురువారం వారు ఎపిఎస్ఆర్‌టిసి చైర్మన్ మల్లికార్జునరెడ్డికి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన చైర్మన్ రెండు రోజుల పాటు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. చైర్మన్‌కు వినతి పత్రం అందజేసిన వారిలో తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కల్యా సుధాకర్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా నరసింహారావు, నగర ప్రధాన కార్యదర్శి సుంకర రామచంద్రుడు, నగర కోశాధికారి టేకూరి సుదర్శన్, కమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంచన శివప్రసాద్ ఉన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

కడప అర్బన్ : పోలీసు శాఖకు వెలకట్టలేని సేవలందించి మరణించిన వారికి జిల్లా పోలీసు శాఖ అండగా ఉంటుందని ఎస్పి అన్బురాజన్ భరోసా ఇచ్చారు. సిద్దవటం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల మృతిచెందిన కె. కొండయ్య సతీమణి కె. సుభాషినికి కార్పస్ నిధి నుంచి మంజూరైన రూ. లక్ష ఆర్థిక సాయాన్ని గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. పోలీసు సంక్షేమంలో భాగంగా ఈ మొత్తాన్ని అందజేశారు. మృతుని కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో డి.ఎ.ఓ జూనియర్ అసిస్టెంట్ రాజేశ్వరి పాల్గొన్నారు.

హనుమంతరావుకు ఉగాది సత్కారం

కడప అర్బన్ : నగరంలోని ఎంఎం ఆస్పత్రిలో రాయల్ కరీం సేవా సమితి ఆధ్వర్యంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత, మొల్ల సాహితీ పీఠం అధ్యక్షులు గానుగపెంట హనుమంతరావును ఎంఎం ఆస్పత్రి అధినేత ప్రముఖ సీనియర్ వైద్యులు డాక్టర్ మహబూబ్ పీర్ చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు. కార్యక్రమంలో ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ ఎస్. ఎం. ఆబిద్, జిల్లా ఉపాధ్యాయ సంఘం నాయకులు చెంచి రెడ్డి, శేషారెడ్డి, ఆరిఫ్, ఎఒ ఫరీద్, కరీం బాబా పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి - చక్రాయపేట

ధర్నా చేస్తున్న యువకులు

తమకు నష్ట పరిహారం ఇవ్వాలని మండలంలోని తాకళ్లపల్లె వద్ద జరుగుతున్న కాలేటి వాగు డ్యామ్ వద్ద గురువారం ఆ గ్రామ యువకులు ధర్నా చేశారు. నష్టపోయిన భూములకు నష్టపరిహారం అందేలా చూడాలన్నారు. నివాస స్థలాన్ని కేటా యించి, ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేశారు. సమస్యను సిఎం జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డి, పులివెందుల ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా లాభంలేదన్నారు. వలస పోయే వాళ్లకు ఇల్లు ఇవ్వబోరని ఒఎస్‌డి అంటున్నారని పేర్కొన్నారు.

శ్రీనాథ్‌రెడ్డి మృతి బాధాకరం

ప్రజాశక్తి - వేంపల్లె

ఎపి ప్రెస్ ఆకాడమీ మాజీ అధ్యక్షులు శ్రీనాథ్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడం చాలా బాధాకరమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శ్రీనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ప్రొద్దుటూరు టౌన్ : మాజీ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి మృతికి స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం పలువురు పాత్రికేయులు తమ సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30ఏళ్లుగా శ్రీనాథ్‌రెడ్డి పాత్రికేయులుగా చేసిన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. నేటి తరం జర్నలిస్ట్‌లకు ఆయన ఆదర్శనీయులని కొనియాడారు.

క్రైం కార్నర్

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండలంలోని కొత్తపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న అమృత్‌నగర్‌లో కురవ రాము(40) అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. ప్రొద్దుటూరు పట్టణం కోనేటికాల్వ వీధిలో నివాసం ఉంటున్న కురవ రాము అతని తమ్ముడు ఉగాది పండుగ సందర్భంగా అమ్మవారికి దేవర నిర్వహిస్తుండగా బుధ వారం కుటుంబ సభ్యులు, బంధువులంతా రాము తమ్ముడు నివాసం ఉంటున్న అమృత్ నగర్‌లోని ఇంటికి వచ్చారు. బుధవారం రాత్రి 11 గంటల వరకు అందరితో కలిసి మద్యం సేవించిన రాము తర్వాత కనిపించలేదు. ఉదయం ఏడు గంటల ప్రాంతంలో అమృత్‌నగర్ సబ్‌స్టేషన్ వీధి 18వ లైన్‌లో రక్తపు మడుగులో రాము మృతి చెంది ఉండడం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనాస్థలానికి చేరుకుని విలపించారు. మృతుడికి 18 ఏళ్ల కుమార్తె, 12 ఏళ్ల కుమార్తె, భార్య ఉన్నారు. రాము ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న సన చికెన్ సెంటర్లో పని చేస్తున్నాడు. హత్యకు గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు సంఘటనాస్థలన్ని ఎస్ఐ సంజీవరెడ్డి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు.

రాము మృతదేహం

ప్రాణం తీసిన ఈత సరదా

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

గణేష్ మృతదేహం

పట్టణ పరిధిలోని ఎర్రగుడిపల్లికి చెందిన లక్కె. గణేష్ (19) గురువారం సరదా కోసం ఈతకు వెళ్లి మృతి చెందాడు. లక్కె సుబ్బారాయుడు, సుబ్బమ్మ రెండో కుమారుడు గణేష్ అతని స్నేహితులతో కలిసి బ్రాహ్మణపల్లి సమీపంలోని బావికి ఈతకు వెళ్లారు, గణేష్‌కు ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. స్నేహితుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని బావిలో నుంచి గణేష్‌ని వెలికి తీసి రక్షించడానికి ప్రయత్నం చేశారు. 108లో పులివెందుల ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. చేతికొచ్చిన కొడుకు హఠాత్తుగా మరణించడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు.

భార్యను చంపిన కేసులో యావజ్జీవ శిక్ష

- 2014లో హత్య.. పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందించిన ఎస్‌పి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సయ్యద్ హుస్సేన్

ప్రొద్దుటూరు పట్టణంలో 2014లో వరకట్న వేధింపులతో జరిగిన వివాహిత హత్య కేసులో నేర నిరూపణ అయినందున ముద్దాయి, మృతురాలి భర్త వక్కల సయ్యద్ హుస్సేన్‌కు యావజ్జీవ కఠిన కారాగార శిక్షతోపాటు రూ.2.10 లక్షల జరిమానా విధిస్తూ రెండవ అదనపు జిల్లా కోర్టు జడ్జి జి.ఎస్.రమేష్ కుమార్ తీర్పు ఇచ్చారు. జరిమానా మొత్తాన్ని మృతురాలి మైనర్ కుమార్తెకు చెల్లించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు. కేసు వివరాల్లోకెళితే.. ప్రొద్దుటూరు పట్టణంలోని వన్ టౌన్ పరిధిలోని మట్టి మసీద్ వీధిలో నివసించే వక్కల సయ్యద్ హుస్సేన్, చక్రాయపేటకు చెందిన సయ్యద్ అల్లా బకాష్ కుమార్తె సయ్యద్ యాస్మిన్‌ను 2010లో వివాహం చేసుకున్నాడు. ఆ సమయంలో ముస్లిం సంప్రదాయం ప్రకా రం లాంఛనాలతో పాటు 10 తులాల బంగారు నగలు, రూ.40 వేల నగదును వరకట్నంగా ఇచ్చారు. పెళ్లి అయిన కొద్ది రోజుల నుండి అదనపు కట్నం కోసం భర్త ఆమెను మానసిక, శారీరక వేధింపులకు గురి చేసేవాడు. ఈ క్రమంలో 2014 ఫిబ్రవరి 22న 7నెలల గర్భంతో ఉన్న భార్య సయ్యద్ యాస్మిన్‌ను రోకలిబండతో తలపై మోది దారుణంగా హత్య చేసినట్లు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మృతురాలి తండ్రి సయ్యద్ అల్లా బకాష్ ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హత్య జరిగినప్పటి సమయానికి దంపతులకు మూడేళ్ల కుమార్తె కూడా ఉంది. దర్యాప్తులో భాగంగా సాక్షుల విచారణ అనంతరం అప్పటి ప్రొద్దుటూరు డి.ఎస్.పి జె.శ్రీనివాసులరెడ్డి ప్రస్తుత విశ్రాంత అధికారి అదే రోజున ముద్దాయి హుస్సేన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణలో ఎలాంటి సాక్ష్యాలు లేనందున ముద్దాయి తల్లి అయిన సయ్యద్ జైబున్నీసాను నిర్దోషిగా విడుదల చేశారు. ప్రొద్దుటూరు ఎఎస్‌పి ప్రేరణ్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు విచారణకు సహకరించిన ప్రొద్దుటూరు వన్‌టౌన్, కోర్టు మాని టరింగ్ సిబ్బందిని జిల్లా ఎస్‌పి కెకెఎన్ అన్బురాజన్ ప్రత్యేకంగా అభినం దించారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని కొలవలి గ్రామంలో గురువారం మహిళా పోలీస్ భర్త నేనావత్ రవినాయక్ (37) గుండెపోటుతో మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం బుగ్గనపల్లి గ్రామం గోరుమాను కొండ తాండకు చెందిన రవినాయక్ కర్నూలు జిల్లాలో ఎస్‌టి ఆశ్రమ పాఠశాల సి క్యాంపులో ఒప్పంద ప్రాతిపదికన ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఆయన భార్య కళావతిభాయి మండలంలోని కొలవలి గ్రామ సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తూ.. కొలవలిలో బాడుగ ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఉగాది పండుగ సందర్భంగా రవినాయక్ కొలవలి గ్రామానికి వచ్చాడు. భార్య పిల్లలతో కలిసి పండుగ సంబరంగా జరుపుకున్నారు. గురువారం ఉదయం స్నానం చేసి ఇంట్లోకి వచ్చి దుస్తులు ధరిస్తుండగా గుండెనొప్పితో కుప్పకూలి పడి పోయాడు. వెంటనే ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వీరికి 3ఏళ్ల పాప, ఏడాది బాబు ఉన్నారు. కుటుంబసభ్యులను ఎంపిడిఒ రమణారెడ్డి పరామర్శించారు.

రవి నాయక్ (ఫైల్‌ఫోటో)

నోరు ఊరిస్తుంది.. కల్తీ కాటేస్తుంది

- నాణ్యతలేమితో ఆరోగ్యం గుల్ల.. పట్టని అధికారులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రోడ్డు పక్కన ఎర్రటి రంగులో కనిపించే చికెన్ పకోడీ చూస్తే ఎవరికైనా నోరూరుతుంది.. బజ్జీలు చూస్తే లాగించేయాలనిపిస్తుంది.. కానీ ఆ పదార్థాల్లోని కల్తీని గుర్తించలేకపోతున్నాం. వ్యాపారులు వినియోగించే నాసిరకం సరుకులు, కల్తీ పదార్థాలతో ఆరోగ్యం గుల్లవుతుందని తెలుసుకోలేకపోతున్నాం. అడుగడుగునా దుకాణాల ముందు చికెన్ పకోడీ, బజ్జీలు, సమోసా, ఫాస్ట్‌ఫుడ్ తయారీ కనిపిస్తున్నాయి. వీటి తయారీకి వాడే నూనె మార్చకపోవడంతో అది విషంగా మారి ప్రజా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. పిల్లలు, యువకులు ఎక్కువగా చికెన్ పకోడీ, గోబీ, నూడుల్స్ తదితర ఫాస్ట్‌ఫుడ్‌లకు అలవాటు పడడంతో ఈ వ్యాపారాలు వర్థిల్లుతున్నాయి. ఈ పదార్థాలు ఇంట్లో చేసుకోవడానికి కొంతమందికి సమయం లేక మరికొందరికి తయారీ చేతకాక బజారులో దొరికే పదార్థాలపై ఆధారపడుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని పరిగణలోకి తీసుకోకుండా డబ్బు సంపాదనే ముఖ్యంగా నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

పర్యవేక్షణ.. నామమాత్రం

హోటల్స్, బేకరీలలో అధికారులు ప్లాస్టిక్ కవర్ల వాడకాలపై తనిఖీలు చేస్తున్నారు. అక్కడ తినుబండారాలు తయారీకి వాడే నూనె, పదార్థాలపై దృష్టి పెట్టడంలేదనే ఆరోపణలున్నాయి. దుకాణాల ముందు తయారు చేస్తున్న బజ్జీలు, చికెన్ పకోడీ, గోబీ వంటి తయారీపై పర్యవేక్షణ లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని ఇలాంటి ఆహార పదార్థాల తయారీపై తనిఖీలు నిర్వహించి, నాణ్యమైన పదార్థాలను ప్రజలకు అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

పలుమార్లు కాగి నల్లగా మారిన నూనె

కరువు భత్యం వెంటనే ప్రకటించాలి : ఎస్‌టిఎఫ్

సమావేశమైన ఎస్‌టిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన మూడు కరువు భత్యాలు (డిఎ), డిఎ పిఆర్‌సి బకాయిలు వెంటనే చెల్లించాలని ఎపి రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సందిళ్ల సుబ్బరాజు యాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్అండ్‌బి బంగ్లాలో గురువారం యూనియన్ ముఖ్య నాయకుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి కానుకగా డిఎ ప్రకటిస్తామని.. ఉగాది దాటిపోయినా దాని ఊసే లేదన్నారు. ఇకనైనా ఆలస్యం చేయకుండా ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన వాటిని చెల్లించాలన్నారు. విశ్రాంత ఉద్యోగలుకు రావలసిన బకాయిలను కూడా చెల్లించాలన్నారు. పిఎఫ్ రుణాలు వెంటనే జమ చేయాలన్నారు. ప్రధాన సమస్యలైన సిపిఎస్ రద్దు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ హామీలను నెరవేర్చాలన్నారు. లేని పక్షంలో అందరినీ కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎస్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సప్పరపు రామాంజనేయులు, ఉపాధ్యక్షులు తుపాకుల మురళి, నాయకులు చీమల శ్రీనివాసులు,వెంకటేష్, కల్లె శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పనులు పూర్తయినా రోడ్డు ఇంతేనా..!

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక రోటరీపురంలో ఉన్న కొన్ని వీధుల్లో అండర్ డ్రయినేజీ కోసం రోడ్లు తవ్వి, ఆ పనులు పూర్తయి ఏడాది అయింది. అప్పటి నుంచి సిసి రోడ్డు వేయకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడితే వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారవుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. రోడ్డుపై గుంతలు, రాళ్లు ఉండడం వల్ల చిన్నపిల్లలు పాఠశాలకు వెళ్లే సమయంలో అవి తగులుకుని కింద పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును వెంటనే వేయించాలని, పందుల సంచారాన్ని కూడా తొలగించాలని వారు కోరుతున్నారు.

రోటరీపురంలో గుంతలు తవ్వి వదిలేసిన రోడ్డు

రక్తం ఇస్తున్న యువత

పల్లవోలులో రక్తదానం

ప్రజాశక్తి - చాపాడు

భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ను ఉరి తీసిన రోజున పల్లవోలు గ్రామంలో యువతలో త్యాగస్ఫూర్తి రగిలించడం కోసం రమణ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రముఖకవి, మాంటిస్సోరి హైస్కూల్ కరస్పాండెంట్ మహమూద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ అమరవీరులు వేసిన బాటలో, నిజాయితీ, నిబద్ధత, నిర్భయత్వం అలవాటు చేసుకోవాలని సూచించారు. రాజకీయాలు మన దేశాన్ని కులం, మతంగా విభజిస్తున్నాయని, యువత ఈ మాయలో పడకుండా దేశం కోసం పని చేయాలని కోరారు. గ్రామంలో వరుసగా అటు నేత్రదానం, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్న పల్లవోలు రమణను అభినందించారు. రక్తదాన శిబిరంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది మహేష్, పుల్లయ్య, గ్రామ యువకులు అఖిల్, శశికుమార్, ఎంఎల్‌హెచ్‌పి సోని, ఎఎన్ఎం హేమలత, ఆశా కార్యకర్తలు మొగిలి లక్ష్మీదేవి, ఆనందమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రంజాన్ మాస ఉపవాస దీక్షలు శుక్రవారం నుండి ప్రారంభం కానున్నాయి. ఈ ప్రాంతంలో నెలవంక కనిపించినట్లు ముస్లిం మత పెద్దలు ప్రకటించడంతో గురువారం రాత్రి ప్రత్యేక ప్రార్థనల(తరావీహ్)తో, శుక్రవారం తెల్లవారుజామున సహరీ (పవిత్ర ఉదయపు భోజనం)తో ముస్లింలు రంజాన్ మాసాన్ని ప్రారంభిస్తారు. ఆదాయపు పన్ను (జకాత్) చెల్లిస్తే సమాజంలో పేదరికం ఉండదని దాదాపు 1400 సంవత్సరాల క్రితం దైవ ప్రవక్త ద్వారా భగవంతుడు ఖురాన్‌లో వివరించారన్నారు. ఆ మేరకు రెండున్నర శాతం పన్నుగా ప్రతి ముస్లిం తన సంపాదనలో పక్కకు తీసి పేదలకు దానం చేస్తారు. జకాత్ చెల్లించిన పిమ్మటే రంజాన్ మాసపు ప్రత్యే ప్రార్థన (ఈదుల్ ఫితర్‌కి నమాజ్) చెల్లుబాటు అవుతుందని మత గ్రంథంలో చెప్పబడి ఉంది. ఎలాంటి అప్పులేని ముస్లిం మాత్రమే ఈ జకాత్ చెల్లింపునకు అర్హుడని పేర్కొనబడింది.

తాళ్ల ప్రొద్దుటూరు వాసికి ఉత్తమ ఆచార్య అవార్డు

ప్రజాశక్తి - కొండాపురం

తెలుగు సంవత్సరాది (ఉగాది) సందర్భంగా రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ వారు మండలంలోని తాళ్ల ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన చాగంటి జగన్‌మోహనాచార్యులుకు ఉత్తమ ఆచార్యులుగా ప్రకటించింది. ఆ మేరకు ఆయన కలెక్టర్ విజయ్‌రామరాజు చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. జగన్‌మోహనాచార్యులుకు అవార్డు రావడం పట్ల మండలంలోని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ జగన్నాథ్

రద్దీ ప్రాంతాల్లో చలివేంద్రాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

జనం రద్దీగా ఉన్న ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామని మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ తెలిపారు. పట్టణ పరిధిలోని రైల్వేస్టేషన్ సమీపంలోని బస్‌స్టాప్ వద్ద మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారం భించారు. ఈ చలి వేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ ముఖ్యఅతిథిగా ప్రారం భించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చడం కోసం మానవత స్వచ్ఛంద సంస్థ, మున్సిపల్ శాఖ సంయుక్తంగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చలివేంద్రం ఏర్పాటుకు కృషి చేసిన మానవతా సభ్యులను కమిషనర్ అభినందించారు. కార్యక్రమంలో 20 వార్డు కౌన్సిలర్ అలీ, మానవత సంస్థ చైర్మన్ రఘురామిరెడ్డి, డాక్టర్ రామాంజనేయులరెడ్డి, మేడ రమేష్‌బాబు, సాంబశివారెడ్డి, విజయ్‌రెడ్డి, రాజ వర్ధన్‌రెడ్డి, మున్సిపల్ ఎఇ సందీప్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్ పాల్గొన్నారు.

అంధకారంలో కొత్తపల్లి రింగ్ రోడ్డు



ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కొద్ది రోజులుగా స్థానిక కొత్తపల్లి ఔటర్ రింగ్ రోడ్డు అంధకారంలో ఉంది. అక్కడ ఉన్న సెంట్రల్ లైటింగ్ కొన్ని ప్రాంతాల్లో పనిచేయడంలేదు. ఆ ప్రాంతం రాత్రి వేళ చీకటిగా మారింది. ఈ నేపథ్యంలో వాహనదారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రొద్దుటూరు కొత్తపల్లి సర్కిల్ నుండి కడప వైపు, జమ్మలమడుగు వైపు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలను సాగిస్తుంటాయి. ఈ సర్కిల్ ప్రాంతం రద్దీగా ఉంటుంది. అప్పుడప్పుడు పగలే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇలాంటి రోడ్డులో వీధిలైట్లు వెలగడంలేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తపల్లి పంచాయతీకి కూతవేటు దూరంలో ఉన్నా, దారి వెంట అధి కారులు, నాయకులు రాకపోకలు సాగి స్తున్నారు. అయినా వారు పట్టిం చుకోవ డంలేదనే విమర్శలున్నాయి. సంబంధిత అధి కారులు కొత్తపల్లి రింగ్ రోడు వద్ద పని చే యని సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను బాగు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

నటరాజును సన్మానిస్తున్న పలువురు ప్రముఖులు

కొండపల్లి చిదంబర నటరాజుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - చాపాడు

16 తబలాలపైన శాస్త్రీయ సంగీతాన్ని పలికించి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డును సృష్టించిన పార్వతీనగర్‌కు చెందిన కొండపల్లి చిదంబర నటరాజుకు ఉగాది సందర్భంగా బుధవారం సాయంత్రం మైదుకూరులోని జడ్‌పి ఉన్నతపాఠశాలలో హెర్బ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా పౌర సన్మానం చేశారు. ఈ సందర్భంగా తెలుగు రచయిత తవ్వా ఓబుళరెడ్డి మాట్లాడుతూ 16 తబలాలపై ఏకధాటిగా వాయిద్యం ప్రదర్శించి ఇండియన్ బుక్ ఆఫ్ అవార్డులో స్థానం సంపాదించడం మైదుకూరు ప్రాంతానికి గర్వకారణమన్నారు. సంగీత కళాకారులకు నిలయమైన పార్వతీనగరంలో ప్రాచీన కళలకు కొదువలేదన్నారు. సన్మాన కార్యక్రమం సందర్భంగా చిదంబర నటరాజు తబళ వాయిద్య కార్యక్రమాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆలిండియా రేడియో కడప డైరెక్టర్ ఎ.విజయభాస్కర్‌రెడ్డి, బ్రౌన్ గ్రంథాలయ ప్రతినిధి జానుమద్ది విజయ్‌భాస్కర్, హంస అవార్డు గ్రహీత కొండపల్లి వీరభద్రయ్య, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దొంతు సుబ్రమణ్యం, హెర్బ్స్ సంస్థ ప్రతినిధులు క్రిష్ణయ్య, శేషగిరి, శివశంకర్, కళాకారులు పాల్గొన్నారు.

పశువులకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

ప్రజాశక్తి - ముద్దనూరు

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని పశువైద్యాధికారి వాసా శ్రీనివాస అన్నారు. మండలంలోని కొర్రపాడు గ్రామంలో గురువారం పశు వైద్యాధి కారి ఆధ్వర్యంలో జాతీయ గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు, పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు టీకాలు వేయడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగు తుందన్నారు. ఆరు నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా పశువులకు టీకాలు వేయించాలన్నారు. దూడల్లో మరణాల శాతం తగ్గించేందుకు దూడ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలన్నారు. దీంతో దూడలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పుట్టిన వారం, పది రోజుల్లోపు ఏలిక పాముల మందు తాగించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

సదాశివారెడ్డి దంపతులను సన్మానిస్తున్న అధికారులు

ఉత్తమ రైతుగా సదాశివారెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

ఉగాది వేడు కల సందర్భంగా మండల పరిధిలోని వి. రాజుపాలెం గ్రామానికి చెందిన లోమడ సదా శివారెడ్డి ఉత్తమ రైతు పురస్కారం అందు కున్నారు. గుంటూరులోని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ క్షేత్ర యూనివర్సిటీలో బుధవారం జరిగిన ఉగాది వేడుకల్లో ఉత్తమ రైతుగా సదాశివారెడ్డి దంపతులను ప్రశంసాపత్రంతో ఘనంగా సన్మానించారు. సదాశివారెడ్డి ఆధునిక పద్ధతుల్లో మినుము, వేరుశనగ వంటి పంటలను సాగు చేస్తూ, నాణ్యమైన విత్తనాలను పండిస్తున్నారు. కొన్నేళ్లుగా మినుము పంట సాగుతో విత్తనాన్ని అందజేస్తున్నారు. ఈ సందర్భంగా మండల ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డికి రెడ్యం అభినందనలు

ప్రజాశక్తి - ఖాజీపేట


రెడ్యంతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులుగా గెలుపొందిన భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని గురువారం టిడిపి రాష్ట్ర సీనియర్ నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తన స్వగ్రామం దుంపలగట్టులో అభినందించారు. ఇటీవల రెడ్యం అనారోగ్యానికి గురైన విషయం విదితమే. ఈ సందర్భంగా రెడ్యం ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు రెడ్యం నాగేశ్వర్‌రెడ్డి, ఇండ్ల వెంకటరెడ్డి, రెడ్యం శ్రీకాంత్‌రెడ్డి, రెడ్యం అభిలాష్‌రెడ్డి, తవ్వా సుబ్బారెడ్డి, వెన్నపూస శశిధర్‌రెడ్డి, తవ్వా అరుణ్‌రెడ్డి, మునెల్లి సుబ్బరాయుడు, బండి వెంకటసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, వేమిరెడ్డి శివశంకర్‌రెడ్డి, రెడ్యం రమణారెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా కక్షదారులు అయిన సయ్యద్ రియాజ్‌బాష, తండ్రి: యస్.జాఫర్‌సాహెబ్, వయస్సు 54 సం.లు., డోర్‌నెం.13/311, బి.కె.యం.వీధి, కడప సిటి, వారు ఇచ్చిన సూచనలు మేరకు యావన్మంది ప్రజానికానికి ఇందుమూలంగా నేను జారీ చేయు బహిరంగ ప్రకటన ఏమనగా

నా కక్షదారుడు అయినటువంటి సయ్యద్ రియాజ్ బాష క్రింది షెడ్యూలు దాకల ఆస్తిని మంగపట్నం షేక్ రేష్మా పర్వీన్ భర్త హబీబుల్లా మంగపట్నం షేక్ గారి నుండి రిజిష్టరు విక్రయ దస్తావేజు తేది: 13.7.2022, దస్తావేజు నెంబరు 6387/2022 రీత్యా పొందురని మరిదీయు సదరు మంగపట్నం షేక్ రేష్మా పర్వీన్ గారు సదరు ఆస్తిని బి.అతికబేగం భర్త సయ్యద్ మహమ్మద్ హసనుద్దీన్ గారి ద్వారా విక్రయ దస్తావేజు తేది:17.01.2022, దస్తావేజు నెంబరు 470/2022 రీత్యా విక్రయించుకొన్నారు. సదరు బి.అతిక బేగం గారు బొమ్మిశెట్టి శ్రీనివాసులు తండ్రి: బొమ్మిశెట్టి వెంకటసుబ్బన్న గారి నుండి ఒక విక్రయ దస్తావేజు తేది: 17.08.2015, దస్తావేజు నెంబరు 3608/2015 రీత్యా విక్రయించుకొన్నారు. సదరు బొమ్మిశెట్టి శ్రీనివాసులు గారు షెడ్యూలు దాఖలా ఆస్తిని పఠాన్ గౌస్ ఖాన్ (ప్రిన్సిపల్) తండ్రి పఠాన్ హుస్సేన్ ఖాన్ గారి నుండి అగ్రిమెంట్ ఆఫ్ సేల్ కమ్ జనరల్ పవర్ ఆఫ్ అటార్ని దస్తావేజు తేది 08.12.2009, దస్తావేజు నెంబర్ 5816/2009 పొందిన పఠాన్ యాసీన్ అలీఖాన్ (లా ఫుట్ ఎజెంటు) తండ్రి పఠాన్ రహీం ఖాన్ గారి నుండి విక్రయ దస్తావేజు తేది: 15.04.2009, దస్తావేజు నెంబర్ 2091/2010 రీత్యా విక్రయించుకొన్నారు. అని తెలుపుచున్నారు. క్రింది షెడ్యూలు లింక్‌డాక్యుమెంటు అయిన ఒరిజినల్ రిజిష్టరు విక్రయ అగ్రిమెంటు కమ్ ఇర్రివోకబుల్ దస్తావేజు తేది: 08.12.2009, డాక్యుమెంటు నెంబరు 5816/2009 పోయినది అని ఎంత వెతికిననూ దొరకలేదు. అని తెలుపుచున్నారు.

కనుక క్రింద తెలుపబడిన దాఖలా ఆస్తికి సంబంధించి ఎవ్వరికైన ఎటువంటి హక్కుగాని, అధికారము గాని, ఆక్షేపణ గాని యున్న యెడల ఆ దినము నుండి 10 రోజులులోగా తత్ సంబంధిత దస్తావేజులతో నా వద్ద హాజరై తను ఆక్షేపణను తెలియచేయవలెను. లేని యెడల షెడ్యూలు దాఖల ఆస్తిని గురించి ఎవ్వరికి ఎటువంటి హక్కు, అధికారము మరియు ఆక్షేపణలు లేవని భావించి సదరు డాక్యుమెంటు నెంబరు 5816/2009 యొక్క నకలును స్వీకరించబడును.

షెడ్యూలు

కనుక డి.,కడప అర్బన్ సబ్-డి., కడప మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన, కడప టౌన్, 9 వార్డు, సాయిపేట వీధి, అగాడి వీధిలోని డోర్‌నెం.9/393-3, అసెస్‌మెంటు నెంబరు 1013070050 గల ఆర్.సి.సి. స్లాబ్ మిద్దె ఇల్లు, బిడువు జాగాకు హద్దులు:-

తూర్పు: వరసంతు మరియు పఠాన్ గౌస్‌ఖాన్ ఇతరులకు అమ్మిన ఇల్లు, పడమర : పబ్లిక్ రోడ్డు, ఉత్తరం: రఖీబ్ సాబ్‌జాన్ గారి జాగా, దక్షిణం : వరసందు పఠాన్ యాసీన్ అలీఖాన్ ఇతరులకు అమ్మిన మిద్దె ఇల్లు.

ఈ హద్దుల మధ్య వుండు జాగాకు కొలతలు :

తూర్పు-పడమర : ఇరువైపుల : అడుగులు, లేక 15.25 మీటర్లు, ఉత్తరం-దక్షిణం : తూర్పు దిశన : 23.1/4 అడుగులు, లేక 7.09 మీటర్లు, ఉత్తరం-దక్షిణం : పడమర దిశన: 20 అడుగులు, లేక 6.10 మీటర్లు,

కొలతలు గల 120.13చ.గజములు గల జాగాయున్నూ, ఈ జాగాలో వుండు తూర్పు-పడమర: 35 అడుగులు, లేక 10.67 మీటర్లు, ఉత్తరం-దక్షిణం: 18 అడుగులు, లేక 5.49 మీటర్లు, కొలతలు గల 630 చ.అడుగులు గల ఆర్.సి.సి.స్లాబ్ మిద్దె ఇల్లు.

పి.గౌతమ్ కుమార్, న్యాయవాది, 3/2056 మారుతీనగర్, కడప.